సామూహిక వివాహాల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: సామాజిక సేవాకార్యక్రమాల ద్వారా సమాజంలో సోదరభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్ 6 వార్డుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పబ్బ శ్రీనివాస్– వాసవీ దంపతుల ఆధ్వర్యంలో 116 మంది పేదింటి జంటలకు సామూహిక వివాహాలు జరిపించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే శ్రీగణేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ మేరకు ఔత్సాహిక యువతీయువకులు డైమండ్ పాయింట్ చౌరస్తా సమీపంలోని మహాలక్ష్మి ట్రేడ్ సెంటర్‌లోని శ్రీనివాస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముప్పిడి మదకర్, యాదగిరి, సదానంద్‌గౌడ్, తేజ్‌పాల్, సంకి రవీందర్, అష్రఫ్, జమీన్ పాల్గొన్నారు.

బోర్డు సమావేశంలో నిధుల గోల

- సర్వీసు చార్జీలకు ఎమ్మెల్యే పట్టు
- ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని బోర్డు సభ్యుడి డిమాండ్
- కేంద్ర ప్రభుత్వ నిధులపై చర్చ



కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే, బోర్డు సభ్యులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని ఎంపీ ఈటల కంటోన్మెంట్‌కు ఆర్మీ ఇవ్వాల్సిన సర్వీసు చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ కోరారు. బస్తీవాసులకు ఇళ్ల పట్టాలు, భవన నిర్మాణ అనుమతుల్లో సడలింపులు, అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ, కంటోన్మెంట్‌లో స్పోర్ట్ కాంప్లెక్స్‌కు స్థల సేకరణ, కమ్యూనిటీహాళ్లకు స్థలాల కేటాయింపు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు తదితర అంశాలపై కంటోన్మెంట్ బోర్డు సమావేశం ప్రజాప్రతినిధులతో వాడివేడీగా సాగింది. కంటోన్మెంట్ బోర్డు నూతన అధ్యక్షుడు బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్‌లతో పాటు బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, జాయింట్ సీఈఓ పల్లవి విజయ్‌వన్షీ, డిప్యూటీ సీఈఓ వీకే నాయర్, బోర్డు అధికారులు పాల్గొన్నారు.

ఎవరేమన్నారంటే..

పేదల ఇళ్ల సమస్య తీర్చండి : ఎంపీ ఈటల

- కంటోన్మెంట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 40–50 ఏళ్లుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించేలా చూడాలని ఎంపీ ఈటల బోర్డు అధికారులకు సూచించారు.
- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలాలు చూపిస్తూ.. భూబదలాయింపు కోరితే సమస్య పరిష్కారం అవుతుందని సీఈఓ వివరించారు.
- రోడ్డు విస్తరణతో వందలాది మంది జీవనోపాధి కోల్పోతారని, ప్రతిపాదిత రోడ్డు విస్తరణను 200 ఫీట్ల నుంచి 120 ఫీట్లకు కుదించేలా చూడాలన్నారు.
- ఆర్మీ స్థావరాల గుండా వెళ్లే సివిలియన్ రోడ్లను సైతం విస్తరించాలని, హస్మత్‌పేట సమీపంలోని కంటోన్మెంట్ స్థలంలో బోర్డు కిందిస్థాయి ఉద్యోగులకు ఇళ్ల పట్టాలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ఎంపీ కోరారు.
- అత్యంత దుర్భర పరిస్థితుల్లో కంటోన్మెంట్‌లో పని చేస్తూ.. విధుల్లో ఉండగానే మరణించిన మాజీ ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాలకు చేపట్టాలన్నారు. 5 శాతం సీలింగ్‌ను ఎత్తివేస్తూ.. అర్హులైలందరికీ న్యాయం చేయాలని కోరారు.
- జనావాసాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో పాటు అసంపూర్తిగా ఉన్నవాటిని తక్షణమే పూర్తి చేయాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ నిధులు వస్తున్నాయా ? : ఎమ్మెల్యే శ్రీగణేశ్

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు కేంద్ర ప్రభుత్వ నిధులేమైనా వస్తున్నాయా? అంటూ ఎమ్మెల్యే శ్రీగణేశ్ బోర్డు సీఈఓను ప్రశ్నించారు. అలాంటివేమీ ఉండవని, స్థానిక పన్నులు, ఆర్థిక సంఘం నిధులు, సర్వీసు చార్జీల ద్వారా మాత్రమే కంటోన్మెంట్‌కు నిధులు సమకూరుతాయని సీఈఓ వివరించారు. దీంతో ఎమ్మెల్యే ప్రతిస్పందిస్తూ.. స్థానిక బీజేపీ నేతలు కేంద్ర నిధులతోనే కంటోన్మెంట్‌లో అభివృద్ధి జరుగుందని ఎలా చెబుతారన్నారు.

- కంటోన్మెంట్‌కు ఆర్మీ ఇవ్వాల్సిన సర్వీసు చార్జీల బకాయిలు ఎంతమేర ఉన్నాయని ఎమ్మెల్యే అడగగా.. రూ.800 కోట్లు దాటాయని సీఈఓ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా పలు కంటోన్మెంట్‌లకు సర్వీసు చార్జీలు ఇచ్చిన కేంద్రం, సికింద్రాబాద్‌కు మాత్రమే ఎందుకివ్వలేదని ఎమ్మెల్యే ఆరా తీశారు. ఆయా కంటోన్మెంట్‌లు కనీసం జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్నందున కేంద్రం సర్వీసు చార్జీలు ఇచ్చిందని, మనకు ఆ పరిస్థితి లేదని సీఈఓ చెప్పారు.
- రాష్ట్ర ప్రభుత్వ నిధుల కోసం కోర్టుకు వెళ్లామని చెప్పుకుంటున్న బీజేపీ నేతలు, ఆర్మీ సర్వీసు చార్జీల విషయంలో మౌనమెందుకు వహిస్తున్నారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. దీంతో ఎంపీ ఈటల కల్పించుకుంటూ.. సర్వీసు చార్జీల విడుదల కోసం తాను ఇదివరకే కేంద్రానికి లేఖ రాశానని, త్వరలోనే వస్తాయన్నారు.
- కంటోన్మెంట్‌లో 9 ఎకరాల విస్తీర్ణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని, తగిన స్థలం చూపించాలని ఎమ్మెల్యే కోరారు.
- ఒకటో వార్డు పరిధిలోని నేతాజీ నగర్‌లో నిరుపయోగంగా ఉన్న సీ ల్యాండ్‌ను కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం కేటాయించాలన్నారు.
- ఓల్డ్ గ్రాంట్ ఆక్రమణదారులు, దొడ్డిదారిన కమర్షియల్‌గా వినియోగిస్తున్నారని, ఈ ఉల్లంఘనలను అడ్డుకోవాలని ఎమ్మెల్యే, బోర్డు అధికారులకు సూచించారు.
- తిరుమలగిరిలోని గాంధీ కమ్యూనిటీహాల్ ఆవరణలోని డంపింగ్‌యార్డును తక్షణమే తరలించాలని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాల్సిందిగా ఆర్మీని అభ్యర్థించామని, త్వరలోనే తరలిస్తామని సీఈఓ తెలిపారు.
- జీహెచ్‌ఎంసీలో విలీనం పేరిట, జాప్యం చేస్తూ.. నాలుగేళ్లుగా కంటోన్మెంట్ ఎన్నికలు నిర్వహించకపోవడం దారుణమని ఎమ్మెల్యే అన్నారు. బోర్డులో ప్రజాప్రతినిధులు ఉంటేనే సమస్య పరిష్కారం సులభతరం అవుతుందన్నారు.
- ఎమ్మెల్యే, ఎంపీ నిధుల మినహా కంటోన్మెంట్ అభివృద్ధికి ఎలాంటి ప్రత్యేక నిధులు ఇవ్వలేదన్నారు. రూ.500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తే కంటోన్మెంట్‌లో బ్రహ్మాండమైన అభివృద్ధి జరుగుతుందని రామకృష్ణ కోరారు.
- కంటోన్మెంట్‌ల అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ చేపడితే వేలాది మంది నిర్మాణదారులకు ఊరట లభిస్తుందని, అదే సమయంలో కంటోన్మెంట్‌కు సుమారు రూ.400 కోట్ల ఆదాయం సమకూరుతుందన్నారు.
- రాజీవ్ రహదారి, ఎన్‌హెచ్–44 విస్తరణతో కంటోన్మెంట్‌లో మెజారిటీ కమర్షియల్ భవనాలు కనుమరుగవుతాయని రామకృష్ణ అన్నారు. రోడ్డు విస్తరణను 200 ఫీట్ల నుంచి 100 ఫీట్లకు కుదించాలన్నారు.

ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి..

సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని బోర్డు సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు రావాల్సిన టీపీటీ నిధులను తన ఖాతాలోకి మళ్లించుకుంటూ.. సకాలంలో చెల్లించలేదన్నారు. ఈ నేపథ్యంలో తాను కోర్టుకు వెళ్తే గానీ, బకాయిలు ఇవ్వలేదన్నారు. ఉచిత తాగునీటి పథకం విషయంలో ఇదే తరహాలో జాప్యం చేయగా.. కోర్టుకెళ్లాకే అమలు ప్రారంభమైందన్నారు.

'డిప్యూటీ మేయర్ ఇలాకాలో అన్ని సమస్యలే'



ఆర్యనగర్‌లో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

లాలాపేట: జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్‌గా ప్రాతినిథ్యం వహిస్తున్న తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో ఎక్కడ చూసినా సమస్యలే నెలకొన్నాయని బీఆర్‌ఎస్ యువజన విభాగం గ్రేటర్ అధ్యక్షులు ఆలకుంట హరి అన్నారు. శనివారం ఆయన పలువురు నాయకులతో కలిసి ఆర్యనగర్‌లో పర్యటిస్తూ గత రెండేళ్ల నుంచి సాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత డివిజన్‌లో సమస్యలను పట్టించుకోలేని అసమర్థ నాయకుల పనితీరుకు ఇదే నిదర్శనం అన్నారు. ఎన్నో ఏళ్ల తరబడి కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని వచ్చే గణపతి నవరాత్రులకు ముందే ఈ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్మాణ పనుల్లో కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా చిత్తశుద్ధితో ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బల్‌రాం, ప్రదీప్, ప్రకాష్, నర్సింగ్, బీఆర్‌ఎస్ నేతలు సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం



రసూల్‌పురా: బొల్లారం రాష్ట్రపతి నిలయం ప్రధానమార్గంలో ఈదురుగాలులకు భారీవృక్షం అకస్మాత్తుగా శనివారం మధ్యాహ్నం ఎదురుగా ఉన్న రెండు హైటెన్షన్ ఎలక్ట్రిక్ పోల్స్‌పై పడగా.. రెండు పోల్స్ ఓ పక్కకు ఒరిగాయి. దీంతో విద్యుత్‌తీగలు రోడ్డుపై వాలాయి. సమాచారం అందుకున్న ఎలక్ట్రికల్ సిబ్బంది, డిజాస్టర్ ఇన్ఫోస్మెంట్ బృందం రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాను నిలిపి విద్యుత్‌ను తిరిగి పునరుద్ధరించారు.

సంస్థపై అసత్య ప్రచారం తగదు

సాక్షి, సిటీబ్యూరో: 30 ఏళ్లుగా స్థిరాస్తి రంగంలో నమ్మకం, నాణ్యమైన నిర్మాణాలు, గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేస్తామనే బ్రాండ్ ఇమేజ్ ఉన్న వాసవి గ్రూప్‌పై కొందరు ఉద్దేశపూర్వకంగా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కంపెనీ డైరెక్టర్ అభిషేక్ చందా తెలిపారు. సంస్థ ఇమేజ్‌ను దెబ్బతీసే ధోరణిలో కొన్ని యూట్యూబ్ ఛానళ్లు కథనాలను ప్రచారం చేస్తున్నామని, ఆయా ఛానళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమీర్‌పేటలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలుదారుల అవసరాలకు తగ్గట్టు నిర్మాణాలను చేపడుతున్నామని, వినియోగదారుల పెట్టుబడిని రెట్టింపు చేసే స్థాయిలో ప్రాజెక్టులను చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మునికుంట, చిన్న మైసమ్మ చెరువుల సుందరీకరణ చేస్తున్నామని పేర్కొన్నారు.

నరసింహ కన్నన్‌కు విశిష్ట పురస్కారాలు



అవార్డులు అందుకుంటున్న నరసింహ కన్నన్

రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ నగర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి, కంటోన్మెంట్ సీనియర్ నాయకులు డాక్టర్ నరసింహ కన్నన్ చేస్తున్న సామాజిక సేవకు అమెరికన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ రెండు విశిష్ట పురస్కారాలు ప్రదానం చేశారు. శుక్రవారం రాత్రి ఢిల్లీ కాన్సిస్టూట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో గ్రేట్ ఇండియన్ పార్లమెంట్ అవార్డు–2024, నెల్సన్ మండేలా ఫెలోషిప్–2024 అవార్డులను డాక్టర్ నరసింహ కన్నన్‌కు ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రదానం చేశారు. అనంతరం కన్నన్ మాట్లాడుతూ.. ఈ అవార్డులు తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. తన సేవలను గుర్తించి అమెరికన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అవార్డులు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

గడువు దాటిన పాలపొడి విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్

సికింద్రాబాద్: గడువు దాటిన పాలపొడిని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ అధికారులు రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి.. రహస్య సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, జీహెచ్‌ఎంసీ అధికారులు సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని విజపురికాలనీలోని ఓ గోదాంపై దాడులు నిర్వహించారు. అందులో గడువు మీరిన పాలపొడి పాకెట్లు పెద్దమొత్తంలో లభించాయి. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం క్షీరభాగ్య పథకం ద్వారా అక్కడి విద్యార్థులకు అందించాల్సిన పాల పౌడర్ ప్యాకెట్లు లభ్యమయ్యాయి. ఈ పొడిని స్వీట్లు, పన్నీర్ తయారీదారులు, ఫుట్‌పాత్ ఫుడ్ కోర్టులు నిర్వహించుకునేవారికి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నగరంలో నాసిరకం పాలపొడిని కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుని విక్రయిస్తున్న భోలక్‌పూర్‌కు చెందిన వ్యాపారి సీహెచ్.దామోదర్ (46)ను రిమాండ్‌కు తరలించారు. రూ.11.50 లక్షల విలువ చేసే 5280 కిలోల పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌వర్మ, సబ్‌ఇన్‌స్పెక్టర్లు కవీదుద్దీన్, మధు, సాయిరాం పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జడ్సీ రవికిరణ్

సికింద్రాబాద్: వీధి కుక్కల నియంత్రణ కోసం శనివారం జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఐదు సర్కిళ్లకు చెందిన డిప్యూటీ కమిషనర్లు, వెటర్నరీ, యూసీడీ అధికారులు, మలేరియా విభాగం అధికారులతో జోనల్ కమిషనర్ రవికిరణ్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీధి కుక్కలను గుర్తించడం, వాటికి జనన నియంత్రణ ఆపరేషన్లు చేయించడం వంటి అంశాల గురించి చర్చించారు. కుక్కలను పెంచుకునేవారు లైసెన్సులు పొందాలన్న విషయం పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

సికింద్రాబాద్: ఓటరు జాబితా–2025 సిద్ధం చేయడం కోసం అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. సికింద్రాబాద్ నియోజకవర్గ ఓటరు జాబితాలో కొత్తపేర్లు నమోదు చేయడం, పాత వివరాల్లో సవరణలు చేయడం తదితర అంశాల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు, పర్యవేక్షకులకు హరిహర కళాభవన్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్ రావు సహా పలువురు అధికారులు వివిధ అంశాల పట్ల బీఎల్ఓలకు అవగాహన కల్పించారు. ఇంటింటి సర్వే ద్వారా వివరాలు నమోదు చేసుకోవడం, మొబైల్ యాప్ ద్వారా అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వంటి విషయాలతో పాటు ఓటర్ల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులపై తీసుకునే చర్యల గురించి వివరించారు. తహసీల్దార్లు పాండునాయక్, భీమయ్యగౌడ్, ఎన్నికల విభాగం అధికారులు శ్రీనివాస్, కే.భుజేందర్‌బాబు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంధ్య పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డ సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ హేమ అధికారులతో కలిసి పరిశీలించారు. మురుగునీటి మ్యాన్‌హోళ్ల నిర్మాణం సక్రమంగా జరగడం లేదని, రోడ్డు తవ్వినప్పుడు మంచినీటి కనెక్షన్లు, పైప్‌లైన్‌లకు నష్టం వాటిల్లిందని స్థానికుల ఫిర్యాదు మేరకు రోడ్డు పనులను పరిశీలించినట్లు కార్పొరేటర్ వెల్లడించారు. ధ్వంసమైన కనెక్షన్లు, పైపులైన్ల స్థానంగా నూతనంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 54 లక్షలు మంజూరయ్యాయని, నెలరోజుల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్పొరేటర్ వెంట జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, స్థానిక నాయకులు ఆకారం రమేష్, రాజేష్ ఉన్నారు.

రైలుకింద పడి ఆత్మహత్య

సికింద్రాబాద్: అప్పుల బాధ భరించలేక ఒక వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అడ్డగుట్ట ఏసీఎస్ నగర్‌కు చెందిన శివరాత్రి రాజు (40) మినీలారీ కొనుగోలు చేసి అప్పుల పాలయ్యాడు. రోజురోజుకు అప్పుల బాధ ఎక్కువ అవుతుండడంతో తీవ్ర మనోవేదనకు గురై ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్యగల ట్రాక్ వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

అనారోగ్యంతో ప్రయాణికుడి మృతి

సికింద్రాబాద్: సిల్చార్ ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్‌కు చేరుకున్న ఒక ప్రయాణికుడు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. సిల్చార్ రైలులో ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు 2వ నెంబర్ ప్లాట్‌ఫాం మీదకు చేరుకున్న రైలు వద్దకు వెళ్లి పరిశీలించగా అప్పటికే వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు గౌహతి నుంచి నగరానికి బయలుదేరిన అస్సాం రాష్ట్రం నాగంకు చెందిన అభిషేక్ (52)గా గుర్తించాడు.

రైల్వేలో ఖాళీలు భర్తీ చేయాలి



సికింద్రాబాద్: రైల్వేలో ఖాళీలను వెంటనే భర్తీ చేసి అవుట్‌సోర్సింగ్ విధానానికి స్వస్తి పలకాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం నగరానికి వచ్చిన రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ సహాయ జనరల్ సెక్రటరీ ఉదయభాస్కర్ మాట్లాడుతూ.. రైల్వే ప్రింటింగ్ ప్రెస్‌ని లాకౌట్ చేయవద్దని కోరారు. రైల్వే మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేకమైన రక్షణ సదుపాయాలు కల్పించాలన్నారు. సరోజినీ రెడ్డి, వరప్రసాద్, కృష్ణ,నరసింహారెడ్డి, రైల్వే క్రెడిట్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ చిలుకు స్వామి పాల్గొన్నారు.

ముగిసిన 'ఇంటర్ స్కూల్స్ ఆర్ట్ కాంపిటీషన్'



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

రసూల్‌పురా: కంటోన్మెంట్ టివోలి రోడ్డులోని అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఆవిర్భావ్ 4వ ఇంటర్ స్కూల్స్ ఆర్ట్ కాంపిటీషన్ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ అమరజ్యోతి రూపకర్త ప్రముఖ శిల్పి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు ఎమ్‌వీ. రమణారెడ్డి, హైదరాబాద్ డబ్ల్యూ డబ్ల్యూఎఫ్ డైరెక్టర్ ఫరీదా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. అక్షర వాగ్దేవి గత నాలుగేళ్లుగా విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్ట్ కాంపిటీషన్‌లో 25 ప్రముఖ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా ఇండ్రేమ్ కంపెనీ సీఈవో సినీనటి గీతాభాస్కర్, శ్రేయా పెన్మెత్స వ్యవహరించారు. జవహర్ బాల్‌భవన్, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ ఆర్ట్ ఇన్‌స్ట్రక్టర్ కప్పరి కిషన్, డీపీఎస్ స్కూల్స్ చైర్మన్ మల్కా కొమరయ్య, ఆర్‌జీఆర్ సిద్ధాంతి కళాశాలల వ్యవస్థాపకులు పీఎల్. శ్రీనివాస్, స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ అలేఖ్య పాల్గొన్నారు.

స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం



స్టేడియాన్ని పరిశీలిస్తున్న అధికారులు

లాలాపేట: ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామని సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్ అన్నారు. స్టేడియం నిర్వహణ కరువై, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్టేడియం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలనీ ఇటీవల వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన డీసీ, స్పోర్ట్స్ అధికారులు శనివారం స్టేడియాన్ని సందర్శించి సౌకర్యాలపై ఆరా తీసారు. మౌలిక వసతుల కల్పన, స్పోర్ట్స్ సౌకర్యాల మెరుగు తదితర సమస్యలను ఈ సందర్భంగా వాకర్స్ అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటేష్, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కిషోర్‌యాదవ్, భాస్కర్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపే శ్రీకృష్ణ జయంత్యుత్సవం



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 26న సాయంత్రం 7 గంటలకు సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో 65వ శ్రీకృష్ణ జయంత్యుత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్ యాదవ్ చెప్పారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లో ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన యాదవ ప్రముఖులంతా హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగెల్లి అంజన్ యాదవ్, జంగిటి ప్రవీణ్ యాదవ్, ఎంబీ కృష్ణ యాదవ్, మొదికే శ్రీనివాసులు, కీర్తి సుధాకర్‌రావు యాదవ్, రాంప్రసాద్ యాదవ్, ఉడుత పరమేశ్వర్ యాదవ్, బొట్టు మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ఘనంగా తీజ్ ఉత్సవాలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ సమీపంలోని సరస్వతి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన తీజ్ ముగింపు ఉత్సవాలకు లంబాడీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఎస్టీ విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో తీజ్ పండుగను పురస్కరించుకొని 9 రోజుల క్రితం ప్రారంభించి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ముగించారు. అమ్మాయిలు సంప్రదాయ ప్రకారం తొట్లలో గోదుమలు పోసి అవి మొలకెత్తి నారుగా పెరిగే వరకు 9 రోజులు భక్తి శ్రద్ధలతో నీరు పోశారు. చివరి రోజు వాటిని తీసి సమీప చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనశక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్, ఎమ్మెల్యేలు రామచంద్రునాయక్, రాందాస్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఓఎస్‌డీ ప్రొ.రెడ్యా నాయక్ ఓయూ అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

సనత్‌నగర్: సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్ వడ్డెర బస్తీలో ఎమ్మెల్యే తలసాని వ్యక్తిగత నిధులతో పునఃనిర్మించిన ఈదమ్మ ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠ పూజాది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పూజల అనంతరం ఎమ్మెల్యేను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజల కోరిక మేరకు ఈ ఆలయాన్ని పునఃనిర్మించడం జరిగిందని, కాలనీ ప్రజలు ఐక్యంగా ఉంటూ నిత్యం పూజలు నిర్వహిస్తూ అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, నాయకులు శ్రీహరి, నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, ఆరీఫ్, ఆలయ కమిటీ సభ్యులు స్వామి, నర్సింహ, యాదగిరి, సునీల్, రేణుక పాల్గొన్నారు.

కలుషిత జలం.. ఆందోళనలో జనం



అసలే విష జ్వరాలతో సతమతమవుతన్న లష్కర్ ప్రజలను కలుషిత జలాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. శనివారం సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీలో రంగుమారిన నీరు సరఫరా అయింది. స్థానికులు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. రాత్రి వరకు కూడా అధికారులు తమ బస్తీకి రాలేదని, తమ బస్తీపై ఇంత నిర్లక్ష్యం ఎందుకని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

–సికింద్రాబాద్

IN THE COURT OF THE SMALL CAUSES AND MACT, AT BANGALORE
M.V.C.No.5192-2023

PETITIONERS : Mr.Valeppa and Others
Vs
Notice to Respondent No. 1) Mr.Mahender Reddy Gorla S/o Bhasker Reddy, R at Janapriya Apts, Athapur, Secunderabad - 500003 & Others.

NOTICE

Take Notice that the Petitioners have filed the above claim petition against the Respondent for the Compensation of Rs.65,00,000/- for the death of deceased in Road Traffice Accident on 10.07.2023 at 03.00 P.M in B.C.Road in front of Prerana School near in front of Thippanna land Srinivasapura Taluk by offending Mahindr Car bearing No. AP-13-AC-6570 the respondent No.1 above named are hereby directed to appear before this Hon'ble court either in eprson or through the pleader on the day 04.10.2024. Before SCCH-8 at 11.00 A.M to defend the above case, falling which the matter will be determined ad Ex-parte

Given under my hand and seal the court on the 21st August day of 2024.

By order of the court

Place: Bangalore
Date: 25.08.2024

NAGARAJA, Advocate
Opp.BESCOM Office
M.G.Road, Srinivasapura
Town and Taluk, Kolar Dist.

అర్ధ శతాబ్దపు వేదిక..అ'పూర్వ' కలయిక



సనత్‌నగర్: ఓనమాలు నేర్చుకున్న ఆ పాఠశాలలో పెనవేసుకున్న స్నేహ బంధం..ఐదు దశాబ్దాల తర్వాత కూడా ఏమాత్రం చెక్కుచెదరలేదని నిరూపించారు. ఎవరికి వారు ఉద్యోగ రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడగా చిన్ననాటి స్నేహితులను నేరుగా కలుసుకునే సమయం లేకపోయింది. అలాంటిది వారి స్నేహానికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని వేదికగా చేసుకుని ఆ చిన్ననాటి స్నేహితుల అపూర్వ కలయిక మదిమదినీ పులకరింపజేసింది. సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా స్కూల్‌లో 1974లో ఒకటో తరగతిలో చేరి 10 దాకా చదివిన బాలికలు, అలాగే ఐదో తరగతి దాకా సెయింట్ థెరిస్సాలో చదివి, తదనంతరం ఆ పాఠశాల బాలికా విద్యకే పరిమితం చేయడంతో డాన్‌బాస్కోలో చేరి పదో తరగతి వరకు చదివిన సహ బాలురు 50 ఏళ్ల తర్వాత కలుసుకుని మురిసిపోయారు. 'గోల్డెన్ ఆత్మీయ సమ్మేళనం' పేరుతో జరిగిన అపూర్వ కలయికకు పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు హాజరై పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిన్ననాటి స్నేహితులను ఒకచోట చేర్చడంలో ఆనంద్‌రాజ్, రమణి రాచపూడి, ఉషారాణి, సత్యసాయి కామేష్, ప్రసాద్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. తరచూ ఇలా కలుస్తూ తమ స్నేహబంధాన్ని కలకలం చాటాలంటూ ప్రతిజ్ఞ చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379